
ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
ఆదివారం
13 జూలై
2025





# శంకు, చక్ర, నామాల పునరుద్ధరణకు చర్యలు

## నమూనాకు ఈవో ఆమోదం



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శంకు, చక్ర, నామాల పునరుద్ధరణకు ఆలయ అధికారులు చర్యలు చేపట్టారు. యాదగిరిగుట్ట ఆలయ పునర్నిర్మాణానికి ముందు కొండకు దక్షిణం వైపున భక్తులకు స్పష్టంగా కనిపించేలా స్వామివారి శంకు, చక్ర, నామాలు ఉండేవి. కొండపైకి వెళ్ళి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకోవడానికి వీలుపడని వృద్ధులు, దివ్యాంగులతో పాటు భక్తులు కొండ కింది నుండే శంకు, చక్ర, నామాలను చూసి భగవంతుని ప్రార్థించి గర్భగుడిలో స్వయంభూ నారసింహుడిని దర్శించుకున్న అనుభూతిని పొందేవారు. ఆలయ పునర్నిర్మాణంలో వాటిని తొలగించగా మళ్ళీ ఏర్పాటు చేయకపోవడంతో.. గర్భగుడిలో స్వయంగా స్వామివారిని దర్శించుకోలేని భక్తులకు వెలితిగా మారింది. దీంతో శంకు, చక్ర, నామాలను తిరిగి ఏర్పాటు చేయాలని ఆలయ ఈవో వెంకటరావు నిర్ణయం తీసుకుని, నమూనాలు సిద్ధం చేయాలని ఆలయ అధికారులను ఇటీవల ఆదేశించారు. దీంతో వెంటనే కార్యాచరణ చేపట్టిన అధికారులు శంకు, చక్ర, నామాలకు సంబంధించి పలు రకాల నమూనాలను రూపొందించి ఈవోకు అందించారు. శంకు, చక్ర, నామాల డిజైన్లను పరిశీలించిన ఈవో.. ఒకదానిని ఫైనల్ చేసి ఆమోద ముద్ర వేసి వెంటనే ఏర్పాటు చేయాలని శనివారం ఆదేశించారు. దీంతో కొండకు దక్షిణం వైపున లడ్డూప్రసాద తయారీ కేంద్రం బిల్డింగ్ పైన శంకు, చక్ర, నామాలు ఏర్పాటు చేయడానికి సన్నాహాలు షురూ చేశారు. రాష్ట్రంలో పలు ప్రాంతాల నుండి యాదగిరిగుట్టకు వచ్చే భక్తులకు.. కొండ కింది నుండే శంకు, చక్ర, నామాలు స్పష్టంగా కనిపించేలా ప్రత్యేక లైటింగ్ తో ఏర్పాటు చేయడానికి పనులు ఆరంభించారు. మూడు రోజుల్లో శంకు, చక్ర, నామాల పునరుద్ధరణ పనులు పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తేనున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

# ప్రజల నమ్మకాన్ని పోలీసులు వమ్ము చేయెుద్దు

### రాచకొండ సీపీ సుధీర్ బాబు

### బొమ్మలరామారం పీఎస్ ను సందర్శించిన రాచకొండ సీపీ



**యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్ :** యాదాద్రి జిల్లా బొమ్మలరామారం పోలీస్ స్టేషన్ ను రాచకొండ సీపీ సుధీర్ బాబు శనివారం సందర్శించారు. పోలీస్ స్టేషన్ లో రికార్డులను పరిశీలించి, పీఎస్ ఫంక్షనింగ్ పై రివ్యూ నిర్వహించారు. నేరాల నియంత్రణకు సంబంధించి పలు సూచనలు చేశారు. గతంలో నమోదైన పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీసు సిబ్బంది పనితీరు ఎలా ఉందో ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసులపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయెుద్దని సూచించారు. తమ సమస్యల పరిష్కారం కోసం పీఎస్ కు వచ్చే నిజాయితీ గల బాధితులకు సత్వర న్యాయం జరిగేలా సహకరించాలని పేర్కొన్నారు. ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఆయన వెంట భువనగిరి డీసీపీ అక్షాంశ్ యాదవ్, ఏసీపీ రాహుల్ రెడ్డి, సీఐలు, ఎస్ఐలు ఉన్నారు.

# రామానుజన్ మ్యూజియంలో గణిత వర్క్‌షాప్

### గణిత విద్యా కేంద్రంలో అధ్యాపకుల గణిత వర్క్‌షాప్ సక్సెస్

### అనుభవపూర్వక బోధనపై శిక్షణ పొందిన లోటస్ లాప్ టీచర్లు





హైదరాబాద్, జులై 12, (రోమింగ్ న్యూస్) :
హైదరాబాద్‌లోని రామానుజన్ మ్యూజియం %ు% గణిత విద్యా కేంద్రం నిర్వహించిన ప్రత్యేక గణిత శిక్షణ కార్యక్రమంలో లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్స్ (దిల్‌సుఖ్‌నగర్, బోడుప్పల్ శాఖలు) మరియు ప్రగతి పాఠశాలల గణిత అధ్యాపకులు చురుకుగా పాల్గొన్నారు. మ్యూజియం సహ వ్యవస్థాపకులు ఎ.టి.బి. బోస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వర్క్‌షాప్, సంఖ్యల రేఖ, బహుభుజాల విస్తీర్ణం, రేఖీయ సమీకరణాలు, బీజగణిత వ్యక్తీకరణలు వంటి అంశాలను గణిత ల్యాబ్ కిట్‌లు, ప్రాక్టికల్ డెమోలు, చైనీస్ బోధనా విధానాల ద్వారా అనుభవపూర్వకంగా ఎలా బోధించాలో వివరించింది. ఈ శిక్షణలో కె. హరీష్, వై. విజయలక్ష్మి, మల్లేశ్, కళ్యాణి రాణి, శాలిని, సబిత, మరియు ప్రగతి స్కూల్స్ డైరెక్టర్ సవిత వంటి అధ్యాపకులు పాల్గొని పార్టిసిపేషన్ సర్టిఫికెట్ లు అందుకున్నారు. ముగింపు కార్యక్రమంలో టి.ఆర్.ఎస్.ఎం.ఏ. రాష్ట్ర అధ్యక్షుడు సాదుల మధుసూదన్, ట్రస్మా సలహాదారు డాక్టర్ కోమటి రెడ్డి గోపాల్ రెడ్డి హాజరై విద్యార్థి కేంద్రిత బోధన విధానాలను అవలంబించాలని అధ్యాపకులకు సూచించారు.

# నారసింహుడి సేవలో ఆర్టీఐ చీఫ్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామిని రాష్ట్ర ఆర్టీఐ చీఫ్ కమిషనర్ డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి శనివారం దర్శించుకున్నారు. ఫ్యామిలీతో కలిసి గర్భగుడిలో స్వయంభూ నారసింహుడిని దర్శించుకుని ప్రధానాలయ ముఖ మంటపంలో స్వామివారి ఉత్సవమూర్తులకు అష్టోత్తర పూజలు నిర్వహించారు. మొదట స్వామివారి దర్శనం కోసం యాదగిరిగుట్టకు వచ్చిన ఆయనకు అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి మొక్క ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామివారి దర్శనం కల్పించారు. తర్వాత ఆశీర్వచన మండపంలో అర్చకులు ఆయనకు వేదాశీర్వచనం చేయగా.. ఆలయ డిప్యూటీ ఈవో భాస్కర్ శర్మ లడ్డూప్రసాదం, స్వామివారి శేషవస్త్రాలు అందజేసి నారసింహుడి ఫొటోను బహూకరించారు. అయన వెంట ఆర్డీవో కృష్ణారెడ్డి, తహశీల్దార్ గణేష్ నాయక్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీఐ చీఫ్ కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు.

# ఆగస్టు 3న 'ఆలిండియా ఎరుకల హక్కుల పోరాట సమితి' ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

### 'ఆలిండియా ఎరుకల హక్కుల పోరాట సమితి' జిల్లా అధ్యక్షుడు మానుపాటి కృష్ణ

### యాదగిరిగుట్టలో ఆవిర్భావ వేడుకల పోస్టర్‌ను ఆవిష్కరించిన నాయకులు



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్:
ఆగస్టు 3న హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే 'ఆలిండియా ఎరుకల హక్కుల పోరాట సమితి(ఏఐవైహెచ్పీఎస్)' 29వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు జిల్లా నుండి పెద్ద ఎత్తున తరలివెళ్లి సక్సెస్ చేయాలని 'ఆలిండియా ఎరుకల హక్కుల పోరాట సమితి' జిల్లా అధ్యక్షుడు మానుపాటి కృష్ణ పిలుపునిచ్చారు. శనివారం యాదగిరిగుట్టలో నిర్వహించిన జిల్లాస్థాయి 'ఆలిండియా ఎరుకల హక్కుల పోరాట సమితి' సన్నాహక సమావేశంలో.. ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూమిపై పుట్టిన మొట్టమొదటి ఆదివాసుల వారసులు 'ఎరుకలు' అని తెలిపారు. కానీ యురేషియన్ బ్రాహ్మణవాదుల కారణంగా.. నేడు స్వీయ గౌరవాన్ని కోల్పోయి జీవచ్ఛవంలా జీవిస్తున్న జాతి ఎరుకల జాతి అని ఆవేదన వ్యక్తం చేశారు. ఎరుకల ఘన చరిత్రను తెలుసుకోవడానికి ఎలాంటి ఆధారాలు, ఆనవాళ్ళు లేకుండా.. కుట్రలు, కుతంత్రాలతో ఎరుకల జాతిని యురేషియన్ బ్రాహ్మణులు నిలువునా మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎరుకలు తమ చరిత్ర తెలుసుకున్నప్పుడే రేపటి చరిత్రను నిర్మించుకోగలమని, అందుకే అందరం సంఘటితమై హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఊరు చివరన విసిరేసినట్లుగా ఉన్న ఎరుకల జాతిని మిగతా జాతులతో సమానంగా సగర్వంగా తలెత్తుకునేలా హక్కులు సాధించుకునేందుకు ఐక్య పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు.

ఇందుకోసమే ఏర్పడింది 'ఆలిండియా ఎరుకల హక్కుల పోరాట సమితి' అని పేర్కొన్నారు. తమ చైతన్యాన్ని చాటి చెప్పడానికి ఆగస్టు 3న హైదరాబాద్ లో నిర్వహించే 'ఆలిండియా ఎరుకల హక్కుల పోరాట సమితి' 29వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు జిల్లా నుండి ఎరుకలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లి విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 'ఆలిండియా ఎరుకల హక్కుల పోరాట సమితి' జిల్లా ఉపాధ్యక్షులు అంగడి కృష్ణ, బొలుగుల నరసింహ, మానుపాటి పరుశురాం, మహిళా సమాఖ్య నాయకురాలు బొలుగుల భాగ్య, మండల అధ్యక్షురాలు దేవరాయ మంజుల, గుండాల, మోత్కూర్, ఆత్మకూరు, భువనగిరి, బీబీనగర్, మోటకొండూర్ మండలాల ఎరుకల సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

# మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

### బీచ్ మహేల్లా ప్రభుత్వ పాఠశాల ఓల్డ్ స్టూడెంట్ అసోసియేషన్ ఓదార్యం



భువనగిరి,జులై 12 (రోమింగ్ న్యూస్): భువనగిరి పట్టణం లోని ఇందిర నగర్ కు చెందిన,కోళ్ల జహంగీర్ అనారోగ్యం తొ మృతి చెందడం తొ,అతడితో కలిసి బీచ్ మహేల్లా ప్రభుత్వ పాఠశాల లో చదువుకున్న దోస్తులందరం కలిసి 20.వేల నగదు తొ,పాటు,25,కిలోల బియ్యం బస్తాను ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా బీచ్ మహేల్లా ప్రభుత్వ పాఠశాల ఓల్డ్ స్టూడెంట్ అసోసియేషన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు ఎండీ ఇంతియాజ్ మాట్లాడుతూ,నిరు పేద కుటుంబం,అయిన కోళ్ల జహంగీర్ అకాల మృతి కలిచి వేసిందని అన్నారు.రెక్కాడితే డొక్కాడని పరిస్థితి లో అతడి 4పిల్లలు పరిస్థితి అయోమయం గా ఉందని గమనించి ఆర్థిక,సహాయం అందజేయడం జరిగిందని, అన్నారు.ఈ కార్యక్రమానికి సహకరించిన, క్లాస్ మేట్స్ అందరికి ప్రత్యేక ధన్య వాదములు తెలిపారు.అలాగే భవిష్యత్తులో కూడ వారి కుటుంబానికి అండగా ఉంటామని,హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమం లో ఓల్డ్ స్టూడెంట్ అసోసియేషన్ సభ్యులు సుమన్,రమేష్,విజయ్ కుమార్ జాలిగం విగ్నేష్, సామాజిక కార్యకర్త కొడారి వెంకటేష్,రాజు కుమార్ సంతోష్,రాధ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

